
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 29 అక్టోబరు 2024



బాధ్యతల స్వీకరణ



మహేశ్వరం, అక్టోబరు 28 : తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్‌గా అల్లూరి వాణిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో జల్‌పల్లి కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. తుక్కుగూడ కమిషనర్ వెంకట్‌రాం జల్‌పల్లి మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా వాణిరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న తుక్కుగూడ మున్సిపాలిటీని అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రజావాణికి 60 ఫిర్యాదులు

అర్జీలు స్వీకరించిన కలెక్టర్ శశాంక



విజ్ఞప్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి'కి 60 ఫిర్యాదులు అందాయి. అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించి 42 అందగా, ఇతర శాఖలకు చెందినవి 18 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

అర్హులైన రైతులందరికీ పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా ఎకరానికి రూ.7500 చొప్పున వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ముకుందం చంద్రశేఖర్ రెడ్డి, చల్లా నారాయణరెడ్డి, బాలయ్య, రజినీకాంత్, బాల్‌రెడ్డి, జాజాల అంజయ్య, రమావత్ చత్రు నాయక్, అమర్ సింగ్, సోమ్లా నాయక్ పాల్గొన్నారు.

కలెక్టర్ సారూ.. నీ కాల్మొక్త!



- తెల్వకుండా నా భూమిని వేరొకరిపై మార్చేశారు
- న్యాయం చేయాలని మహిళా రైతు వేడుకోలు

ఓ సారూ.. నీ కాల్మొక్త. నా భూమిని నాకు తెల్వకుండా అధికారులు వేరొకరికి మార్చేశారు. ఎమ్మార్వో ఆఫీసుకోతే పట్టించుకోవడం లేదు. ఇక నాకు చావేదిక్కు అంటూ ఓ మహిళా రైతు కలెక్టర్ ఎదుట కన్నీరు మున్నీరైంది. ఎలాగైనా తన భూమిని ఇప్పించాలని చేతులు జోడించి వేడుకుంది. కలెక్టరేట్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మంచాల మండలం బండలేమూరుకు చెందిన కొట్టం యాదమ్మ భర్త సాయిలు సోమవారం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న కలెక్టర్ శశాంక వద్దకు యాదమ్మ చేరుకొని తన గోడును విన్నవించింది. బండలేమూరు గ్రామం సర్వే నెంబరు 903లో 2.26 ఎకరాలు, 906లో 6.14 ఎకరాలు, మొత్తం 9 ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో ఉందని, 1962 నుంచి కబ్జాలో ఉంటూ సాగు చేసుకుంటున్నట్లు తెలిపింది. ఇప్పటి వరకు ప్రతీ పహానీల్లో రికార్డు తన పేరిటే ఉందని, వారం క్రితం వరకు ఆన్‌లైన్‌లో ఉన్న 9 ఎకరాల భూమిలోంచి 3.29 ఎకరాలు తగ్గిందని తెలిపింది. తనకు తెలియకుండా తన భూమిని వేరొకరి పేరిట మార్పిడి చేశారని ఆరోపించింది. తన భూమిని తనకు యథావిధిగా రికార్డుల్లో చేర్చాలని కలెక్టర్‌ను వేడుకుంది. స్పందించిన కలెక్టర్ వెంటనే ఆర్డీవోకు ఫోన్ చేసి మాట్లాడారు. ఫీల్డ్ విజిట్ చేసి పూర్తి నివేదికను మంగళవారం అందించాలని ఆదేశించారు.

కలెక్టర్‌గా నారాయణరెడ్డి

- ప్రస్తుత కలెక్టర్ శశాంక బదిలీ
- 10నెలల కాలంలోనే ప్రత్యేక గుర్తింపు
- పలు భూ కుంభకోణాలు వెలికితీత

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా సి. నారాయణరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత కలెక్టర్ శశాంకను ప్రభుత్వం కొత్తగా చేపడుతున్న ఫ్యూచర్‌సిటీ, ఇతర ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు కమిషనర్‌గా నియమించింది. వాస్తవానికి కొద్ది రోజులుగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు బదిలీ అవుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ప్రభుత్వం సోమవారం జిల్లా కలెక్టర్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో నల్గొండ కలెక్టర్‌గా పనిచేస్తున్న సి.నారాయణరెడ్డిని నియమించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నర్వ మండలం శ్రీపురం. నారాయణరెడ్డి ఇంతకు ముందు వికారాబాద్, నిజామాబాద్, ములుగు జిల్లాల కలెక్టర్‌గా పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు నల్లగొండ జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. నారాయణరెడ్డి 2009లో గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించి ఆర్డీవోగా ఎంపికై పెద్దపల్లి, సూర్యాపేట, గద్వాలలో పనిచేశారు. 2015లో కన్‌ఫర్డ్ ఐఏఎస్ రావడంతో పదోన్నతిపై ఆయన్ని నల్గొండ జాయింట్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. 2019లో ములుగు జిల్లా ఏర్పాటైనప్పుడు తొలి కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆ తర్వాత నిజామాబాద్, వికారాబాద్ కలెక్టర్‌గా పనిచేశారు. నల్గొండ కలెక్టర్‌గా ఇపుడు రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. నారాయణరెడ్డి స్వగ్రామం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నర్వ మండలం శ్రీపురం. ఉస్మానియా యూనివర్శిటీలో

మిగతా 8వ పేజీలో...



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

టీకాతో ధీమా

ఉచితంగా గాలికుంటు నివారణ వ్యాక్సిన్

- జీవాలపై ప్రత్యేక శ్రద్ధ
- ఊరూరా చురుగ్గా కొనసాగుతున్న కార్యక్రమం
- నవంబరు 11 వరకు కొనసాగనున్న ప్రక్రియ
- పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు





గాలికుంటు టీకాల వివరాలు
లక్ష్యం 2,40,000
ఇప్పటి వరకు వేసినవి 1,00,000

పాడి రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. పశువులు రోగాల బారినపడకుండా పశువైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఉచితంగా టీకాలు వేస్తున్నారు. అంతేకాకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పశువులకు సోకే ప్రధాన వ్యాధుల్లో గాలికుంటు ఒకటి. సకాలంలో వ్యాధి లక్షణాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే పశువులు, వాటి పాలు తాగిన దూడలు మృత్యువాత పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో గాలి కుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీన ప్రారంభించారు. వచ్చేనెల 11 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. జిల్లాలో బృందాలుగా ఏర్పడి టీకాలు వేసే పనిలో పశువైద్య సిబ్బంది నిమగ్నమయ్యారు. జిల్లాలో 2.40 లక్షల పశువులకు గాలికుంటు నివారణ టీకాలు ఉచితంగా వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు

మిగతా 8వ పేజీలో...

కోతకు గురైన బీటీరోడ్డు



- నిర్దవెల్లి సమీపంలో ప్రమాదకరంగా దారి
- వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- కల్వర్టు నిర్మించాలంటూ స్థానికుల విన్నపం

8

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



- పెండింగ్ డీఏలను ఇవ్వాలి
- పీఆర్సీని ప్రకటించి సత్వరమే అమలు చేయాలి
- తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఘనపురం సురధీర్

7

ఇళ్ల పంపిణీలో రాజకీయాలు వద్దు



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ నరేందర్

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీలో రాజకీయ దందాలకు తెర లేపొద్దని షాద్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ కొందూటి నరేందర్ కోరారు. షాద్‌నగర్ బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నరేందర్ మాట్లాడారు. రాజకీయ జోక్యం లేకుండా ఇళ్లను అధికారులే లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. 1694 ఇండ్లకుగాను 1383 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి, ఇళ్లను నిర్మించారని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ ఆగిపోయిందని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు టి. ప్రతాప్‌రెడ్డి, ఆలోనిపల్లి శ్రీనివాస్‌గౌడ్, కానుగు అంతయ్య, రెటికల్ నందీశ్వర్, కోఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్, బీఆర్ఎస్ నాయకులు యుగంధర్, జూపల్లి శంకర్, చీపిరి రవియాదవ్, పిల్లి శేఖర్, ఎజాజ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా బాల్య వివాహాల నిర్మూలన చట్టం

చేవెళ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహల నిర్మూలన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆలూరు గ్రామం మాజీ సర్పంచ్ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఆలూర్ గ్రామంలో ఓ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో చట్టంపై అవగాహన కల్పించారు. చట్టం చేసి 18 ఏళ్లు గడుస్తున్నా నేటికీ అక్కడక్కడ బాల్యవివాహాలు జరగడం దురదృష్టకమరమన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మా రూటే సపరేటు!

- గాంజ రూపం మార్చి.. పోలీసులను ఏమార్చి అమ్మకాలు
- పౌడర్, లిక్విడ్, చాక్లెట్ల రూపంలో విక్రయం
- ఆయిల్ రూపంలోని గాంజాకు రూ.లక్షల్లో ధర
- యువతే స్మగ్లర్ల టార్గెట్



చాక్లెట్ల రూపంలో గంజాయి

రూటు మార్చిన గంజాయి ముఠా



లిక్విడ్ గంజాయి విక్రేతలను అరెస్టు చేసిన పోలీసులు (ఫైల్)

ఆదిభట్ల, అక్టోబరు 28 : గంజాయి విక్రయ ముఠా రూటు మార్చింది. గతంలో గంజాయిని బస్తాల్లో నింపి వాహనాల్లో తరలించి పట్టుబడేవారు. ఇలా లక్షల రూపాయలు నష్టపోతున్నామని గ్రహించిన అక్రమార్కులు ఈ మూస పద్ధతికి స్వస్తి పలికారు. ముడి సరుకును పౌడర్, లిక్విడ్, చాక్లెట్స్, పసుపు ప్యాకెట్ల రూపంలోకి మార్చి పోలీసులను ఏ మార్చి జోరుగా వ్యాపారం కొనసాగిస్తున్నారు.

ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నెల రోజుల వ్యవధిలో రెండు గంజాయి కేసులు నమోదయ్యాయి. అందులో గంజాయిని లిక్విడ్ రూపంలోకి మార్చి వంట నూనెలుగా నమ్మించి హయిష్ ఆయిల్ అనే పేరుతో మార్కెట్‌లో విక్రయిస్తూ ముగ్గురు పట్టుబడ్డారు. వారినుంచి 3.8 కిలోల లిక్విడ్ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.30 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మరో కేసులో

మిగతా 8వ పేజీలో...



సమావేశంలో మాట్లాడుతున్న దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ

ఉద్యోగ భద్రత కల్పించాలి

శంషాబాద్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధూపదీప నైవేద్య సంఘం అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ బ్రహ్మణపల్లి సాయిబాబా ఆలయం వద్ద రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్‌ను సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ పలు తీర్మానాలు ప్రవేశపెట్టగా జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్, కార్యదర్శులు రామానుజచార్యులు, అనిల్‌కుమార్‌శర్మ, ఉపాధ్యక్షుడు సునీల్‌జోషి తీర్మానాలను ఆమోదించారు. గౌరవ వేతనం రూ.10వేల నుంచి రూ.22,500 వరకు పెంచాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.



పాఠశాల గేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు

పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన.. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌సిప్‌లు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో విద్యార్థులు అక్కడే బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రూ.8300 కోట్ల ఫీజు బకాయిలు పేరుకుపోయాయని, మూడేళ్లుగా వీటిని విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కాలేజీలు నడపలేమనే పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేక అద్దెభవనాల యజమానులు గేట్లకు తాళాలు వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, వంశీ, తరంగ్, విప్లవ్‌కుమార్, లక్ష్మణ్ తదితరులున్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

అక్రమ డిప్యుటేషన్ రద్దు చేయాలి

- ఉపాధ్యాయుడిని వెనక్కిరప్పించాలని ఆందోళన

షాద్‌నగర్‌రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఏడేళ్లుగా అక్రమ డిప్యుటేషన్‌పై హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తూ ఎలికట్ట పాఠశాల నుంచి వేతనం తీసుకుంటున్న ఉపాధ్యాయుడిని వెనక్కి రప్పించాలని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. సోమవారం ఎలికట్ట పాఠశాల గేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలకు ఏడేళ్ల క్రితం గణితం ఉపాధ్యాయుడిగా బదిలీపై వచ్చిన వెంకటేశ్వర్‌రావు ఏ ఒక్క రోజు వచ్చి పాఠాలు చెప్పిన దాఖలాలు లేవని ఆరోపించారు. ఉపాధ్యాయుడిని వెనక్కి రప్పించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంఈఓకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆకాశ్ నాయక్, పవన్ చౌహాన్, రమేష్, గణేష్ ఉన్నారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

తలకొండపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తలకొండపల్లి మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించిన సదర్ ఉత్సవాలు అంబరాన్నంటాయి. స్థానిక యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించిన వేడుకల్లో వివిధ పార్టీల నాయకులు, యాదవ సంఘం నేతలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ భ్రమరాంబమల్లికార్జున యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, మిషన్‌భగీరథ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, ఆమనగల్లు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పద్మనర్సింహ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకల్లో దున్నపోతులను అందంగా అలంకరించి వాటితో విన్యాసాలు చేయించారు. సదర్ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, యువతీయువకుల నృత్యాలు ప్రత్యేక

మిగతా 8వ పేజీలో...

కొడంగల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి


నూతన ఐబీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రాంత అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సిటిజన్ క్లబ్ ఆవరణలో నూతన ఐబీ భవన నిర్మాణానికి కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, వార్ల విజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్, టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్‌లతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తున్నారన్నారు. మద్దూర్ నూతన మున్సిపాలిటీ ఏర్పాటుతో అన్ని విధాలుగా అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, శివప్ప, శంకర్‌నాయక్, ఆసిఫ్‌ఖాన్, దాము, బాల్‌రాజ్, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ సురేశ్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: అభాగ్యులకు అండగా సీఎంఆర్ఎఫ్ దోహదపడుతుందని తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ నిర్వహించారు. రూ.65 లక్షలతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనం, రూ.27 లక్షలతో నిర్మిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశమై పలు సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బిందు సేద్యం పరికరాల పంపిణీలో పాల్గొన్నారు. అలాగే సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, అంజిల్‌రెడ్డి, నర్సిములునాయుడు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో పలువురు అధికారుల బదిలీలు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి 28(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలో పలువురు జిల్లా అధికారులు బదిలీ అయ్యారు. జెడ్పీ సీఈవో దిలీప్ కుమార్ బదిలీపై నిజామాబాద్ కమిషనర్‌గా వెళ్లాడు. శంకర్ కుమార్ హనుమకొండ నుంచి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు పరిశ్రమశాఖ అధికాగారి బదిలీపై రాగా, జిల్లా శిశు సంక్షేమ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారెడ్డి బదిలీపై యాదాద్రి-భువనగిరి జిల్లా, భువనగిరి ఆర్డీవోగా బదిలీపై వెళ్లారు.

కీసర ఆర్డీవో సిరిసిల్లకు..

కీసర: కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి బదిలీ అయ్యారు. సాధారణ బదిలీలో భాగంగా ఆయనను సిరిసిల్లకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా మేడ్చల్ జిల్లా గనులు, భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్(డిప్యూటీ కలెక్టర్ హోదా) సైదులు కీసర ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టనున్నారు.

మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే సన్మానం



తాండూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ ఉన్నారు.

కండలరాయుళ్ల పోటీల్లో ప్రథమస్థానం



శంకర్ సింగ్

మేడ్చల్‌టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో కండలరాయుళ్లకు నిర్వహించిన మాస్టర్ క్లాసిక్ కండలరాయుళ్ల మానియ మాస్టర్స్ పోటీల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన ఎక్స్‌ట్రీమ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ శంకర్‌సింగ్ ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. దీంతో పాటు అంతర్జాతీయ స్థాయి పోటీల ఎంపికల భాగంగా త్వరలో బెంగళూరులో నిర్వహించే సెలక్షన్ పోటీలకుసైతం ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు ఎక్స్‌ట్రీమ్ పిట్‌నెస్ జిమ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శంకర్ సింగ్‌తో కలిసి కండరాయుళ్లు ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు.

భూకుంభకోణంపై లోతైన విచారణ చేయాలి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమంగా కొల్లగొట్టిన వేల కోట్ల విలువచేసే భూములపై ఈడీ మరింత లోతుగా విచారణ చేపట్టాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. సీనియర్ ఐఏఎస్ అధికారి, రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్‌కుమార్ హయాంలో జరిగిన భూముల బదలాయింపులు అతని వెనకాల ఉన్న బడా నేతలెవరనేది ఈడీ నిగ్గుతేల్చాలన్నారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు. ధరణిని అడ్డుపెట్టుకుని అప్పటి ప్రభుత్వంలో పెద్దలు, అధికారులు కలిసి ఈ కుంభకోణానికి తెరలేపారన్నారు. వట్టినాగులపల్లిలోని శంకర్‌హిల్స్‌లో ప్లాట్ల కొనుగోలుదారులిచ్చిన ఫిర్యాదులు, భూముల బదలాయింపులపై కూడా విచారణ చేయాలన్నారు. జిల్లాలో అప్పటి ప్రభుత్వంలో అనేక చోట్ల విలువైన భూములపై అందుతున్న పిర్యాదులపై విచారణ వేగవంతం చేయాలన్నారు. అలాగే జిల్లాలో ప్రభుత్వ, దేవాదాయ, ఎవాక్యూ ప్రాపర్టీకి సంబంధించిన భూముల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కొంగరకలాన్‌లో కలెక్టరేట్ ఎదుట ఉన్న వంద ఎకరాల భూములు తప్పుడు పత్రాలతో ఇతరులకు కట్టబెట్టారని మండిపడ్డారు. ఈడీ అధికారులు అడిగితే తమ దగ్గరున్న ఆధారాలను ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని రంగారెడ్డి తెలిపారు.

ఒకేరోజు ఒకే కాలనీలో ఐదుగురి మృతి

- ముగ్గురు అనారోగ్యంతో ఇద్దరు రోడ్డుప్రమాదంలో..
- పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో విషాదం

ఘట్‌కేసర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో ఒకే కాలనీలో ఒకే రోజు ఐదుగురు మృతిచెందారు. ఈ ఘటన మేడ్చల్-మాల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ లక్ష్మీనర్సింహస్వామి కాలనీలో సోమవారం జరిగింది. కాలనీకి చెందిన మేడబోయిన ఎట్టయ్య(68) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. చెంచెల శ్రీనివాస్(60), తులసీరాం నాయక్(58) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఇదే కాలనీలో గైక్వాడ్ దీపక్(50), అతడి అల్లుడు పరమేశ్‌లు సదాశివపేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఇందులో ఎట్టయ్య, శ్రీనివాస్, తులసీరాం అంత్యక్రియలు సోమవారం సాయంత్రం పూర్తి చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దీపక్ అంత్యక్రియలు సోమవారం రాత్రి నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. పరమేశ్ అంత్యక్రియలను మహారాష్ట్రలో నిర్వహించేందుకు తీసుకెళ్లినట్లు కాలనీవాసులు తెలిపారు. 24గంటల వ్యవధిలో ఒకే కాలనీకి చెందిన ఐదుగురు మృతిచెందడంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాలనీలో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు చావు డప్పు శబ్దాలతో కాలనీవాసులు ఉలిక్కిపడ్డారు. మృతుల అంతిమ యాత్రల్లో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రెడ్డియానాయక్, కౌన్సిలర్లు రాజశేఖర్, సాయిరెడ్డి, ఆయా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీసీఐ ఫ్యాక్టరీలో పీఎఫ్‌పై స్పెషల్ డ్రైవ్

సద్వినియోగం చేసుకోవాలన్న అధికారులు



ఫ్యాక్టరీలో పీఎఫ్‌పై ఫిర్యాదు చేస్తున్న కార్మికులు

తాండూరు రూరల్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామ శివారులో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఫ్యాక్టరీలో ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్)పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హైదరాబాద్‌లోని పీఎఫ్ రాష్ట్ర కార్యాలయం నుంచి రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బాలకృష్ణ, సోషల్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం సీసీఐ ఫ్యాక్టరీలో క్యాంప్ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీఐ ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఉద్యోగులు కాంట్రాక్టు కార్మికుల పీఎఫ్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రెండు రోజులపాటు జరిగే స్పెషల్ డ్రైవ్‌ను కార్మికులు ఉపయోగించుకోవాలని సూచించారు. కంపెనీలో వివిధ విభాగాల్లో ఉన్న కాంట్రాక్టర్లు క్యాంప్‌కు రాకపోవడంపై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. యజమాన్యం, కాంట్రాక్టర్లు సమన్వయంతో ఉంటేనే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ క్యాంప్‌లో 200 మంది కార్మికులు తమ సమస్యలను ఎకరువు పెట్టారు.

ఫైర్‌కు రూ.3 వేలు పోలీస్‌కు రూ.4 వేలు

- టపాసుల షాప్ ఏర్పాటుకు ముట్టచెప్పాల్సిందే
- చలానాలు చెల్లిస్తున్నా.. ఇదే తంతు అంటున్న చిరు వ్యాపారులు
- దీపావళి పండగకు ఏటా తప్పని దోపిడీ



టపాసుల దుకాణం ఏర్పాటు కోసం చిగుళ్లపల్లి మైదానంలో మార్కింగ్ చేస్తున్న నిర్వాహకులు

వికారాబాద్, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని అధికారులు వ్యాపారంగా మలుచుకుంటున్నారు. పేద, మధ్య తరగతికి చెందిన యువకులు పండగ సందర్భంగా టపాసుల దుకాణాలు పెట్టి నాలుగు రాళ్లు సంపాదించుకుందామనుకుంటే దాంట్లో కూడా పలువురు అధికారులు కక్కుర్తి చూపిస్తున్నారు. ఏటా ఇదే తంతు జరుగుతున్నా వ్యాపారంలో ఇబ్బంది రావొద్దని వారు సైతం వాళ్లు ఎంత అడిగితే అంత ఇస్తూ పోతున్నారు.

చిగుళ్లపల్లి మైదానంలో దుకాణాలు

వికారాబాద్ పట్టణంలోని చిగుళ్లపల్లి మైదానంలో ప్రతీ సంవత్సరం టపాసుల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం స్థలానికి రూ. 6 వేలు, మున్సిపాలిటీకి చలానా రూ.2,500, ఫైర్స్ విభాగం చలానా రూ.500లు చెల్లించి ఆర్డీవో, పోలీస్ శాఖ నుంచి అనుమతులు తీసుకుంటూ వ్యాపారం చేస్తున్నారు. మొత్తంగా అక్కడ ప్రతీ సంవత్సరం 30 నుంచి 35 షాపుల వరకు పెట్టి వ్యాపారం చేస్తుంటారు. అయితే ఇందులో ఎక్సైజ్, పోలీసు శాఖకు చెందిన కింది స్థాయి సిబ్బంది చేతివాటం చూపుతున్నట్లు తెలుస్తోంది. 3, 4 రోజులు నిర్వహించుకునే ఈ వ్యాపారంలో కూడా చేతులు చాపుతూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

సుమారు రూ.3 లక్షల పైమాటే

పట్టణానికి చెందిన ఓ వ్యాపారి చిగుళ్లపల్లి మైదానంలో టపాసుల దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు అన్నీ తీసుకున్నారు. అయితే పోలీస్ శాఖలో కొందరికి రూ.4 వేలు, ఫైర్ శాఖలో రూ.3 వేలు అదనంగా ఇవ్వాల్సి వచ్చిందని, వ్యాపారం చేసే సమయంలో ఈ డబ్బులు ఇవ్వకపోతే ఇబ్బందులకు గురి చేస్తారని ఆ వ్యాపారి వాపోయాడు. అయితే కింది స్థాయి సిబ్బంది సైతం మాకు ఏం దొరుకుతాయి సంవత్సరానికి ఒక్క సారి ఇప్పుడు ఇవ్వకపోతే మరెప్పుడు ఇస్తారంటూ లైసెన్సుల కోసం వచ్చే వారి వద్ద చేతులు చాస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించేందుకు కూడా ఒకషాప్‌కు ఇంత ఇస్తారా? అని వసూలు చేస్తున్నట్లు సమాచారం. మొత్తంగా 34 షాపులకు కలిపి సుమారు రూ.3 లక్షల వరకు లంచాల రూపంలో వసూలు చేస్తున్నారని ఆ చిరువ్యాపారులు మండిపడితున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు వ్యాపారుల వద్ద అధికారులు చెయి చాచకుండా చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

తాండూరులో అధికారుల తనిఖీలు



దుకాణాలను తనిఖీ చేస్తున్న ఫైర్ సేఫ్టీ అధికారులు

తాండూరు: హైదరాబాద్‌లో టపాసుల దుకాణంలో జరిగిన అగ్ని ప్రమాదం నేపథ్యంలో సోమవారం తాండూరు పట్టణంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను తాండూరు ఫైర్ స్టేషన్ ఇన్చార్జి జలేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఆయా దుకాణాలలో వ్యాపారులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నారా? అనే విషయాన్ని పరిశీలించారు. తాండూరు పట్టణంలో ఆన్‌లైన్ ద్వారా 13 దుకాణాల ఏర్పాటుకు అనుమతి తీసుకున్నారు. దుకాణాల వద్ద తప్పనిసరి అగ్నిమాపక పరికాలు, వాటర్ డ్రమ్, ఇసుక బకెట్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని దుకాణాదారులకు సూచించారు.

ఎన్‌టీఆర్ జీఈఎస్‌టీని సద్వినియోగం చేసుకోవాలి

- డిసెంబరు 8న ప్రవేశ పరీక్ష
- ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ ఎన్.వీ. రామారావు



మొయినాబాద్ రూరల్, నవంబర్28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ విద్యాసంస్థల ఉపకార వేతనం కోసం డిసెంబరు 8న బాలికా విద్యా స్కాలర్‌షిప్(జీఈఎస్‌టీ) పరీక్షను మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ సమీపంలోని గండిపేట చెరువు సమీపంలోని ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల డీన్ ఎన్‌వీ. రామారావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్టీ ఆధ్వర్యంలో ప్రతిభాంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలను అందిస్తున్నట్లు ట్రస్టీ చైర్మన్ నారా భువనేశ్వరి ప్రకటించినట్లు తెలిపారు. ఇందుకు గాను అర్హులను ఎంపిక చేసేందుకు పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు 10వ తరగతి చదివే బాలికలు అర్హులన్నారు. మొదటి పది ర్యాంకులు సాధించిన వారికి నెలకు రూ.5 వేల, తర్వాతి 15 ర్యాంకులు సాధించిన వారికి నెలకు రూ.3 వేల చొప్పు ఇంటర్ పూర్తయ్యే వరకు ఉపకార వేతనం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు 7660002627 నంబరుకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జేయియి మెయిన్, నీట్, సివిల్స్ ఇంటిగ్రేటెడ్ కోచింగ్‌తో పాటు ఇంటర్, డిగ్రీ కోర్సులకు సిద్ధం కావాలనుకునే ప్రతిభవావంతులైన బాలికలకు నాణ్యమైన విద్యతో, ఆర్థిక సాయం అందించడానికి, ప్రతిభవంతులను గుర్తించేందుకు ఎన్టీఆర్ విద్యసంస్థలు ప్రతీ ఏడాది ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కీచక అధ్యాపకుడు!

- విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన
- పెద్దేముల్ కళాశాలలో ప్రజాసంఘాల ధర్నా
- పోలీసులకు ఫిర్యాదు.. పోక్సో కేసు నమోదు



సమస్యను తెలుసుకుంటున్న ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కొమ్ము రజిత

పెద్దేముల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు చెప్పాల్సిన అధ్యాపకుడు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ప్రజాసంఘాలు స్పందించడంతో కటకటాల పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ అధ్యాపకుడిగా పనిచేస్తున్న జమీల్ ఇటీవలే ప్రభుత్వ అధ్యాపకుడిగా రెగ్యులరైజ్ అయ్యాడు. కొన్ని రోజులుగా విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్నాడనే విషయం బయటకు వచ్చింది. దీంతో ఆగ్రహానికి గురైన ప్రజాసంఘాలు, యువజనసంఘాల సభ్యులు సోమవారంకళాశాల ఆవరణలో ఆందోళనకు దిగారు. అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న అధ్యాపకుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు వెంటనే అతడిపై కేసునమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. విషయం తెలిసి రాష్ట్ర ప్రిన్సిపల్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కొమ్ము రజిత, జిల్లా నోడల్ ఆఫీసర్ అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు కళాశాల వద్దకు చేరుకుని ధర్నా చేస్తున్న వారిని సముదాయించారు. ఫిర్యాదు చేస్తే తాము చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీసులు ముందు జాగ్రత్తచర్యగా జమీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రజాసంఘాలు, యువజన సంఘాల సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత విద్యార్థిని కూడా రాతపూర్వక ఫిర్యాదు చేయడంతో జమీల్‌పై లైంగిక వేధింపుల, పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గిరి తెలిపారు.



ధర్నా చేస్తున్న ఏజెంట్లు

ఎల్ఐసీ ఏజెంట్ల కమీషన్‌ను తగ్గించే నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి

వికారాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్ల కమీషన్‌ను తగ్గించే నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని 1964 లియోఫీ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎస్ చారి అన్నారు. ఐఆర్‌డీఏ అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ సోమవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 50 ఏళ్ల కిందట నిర్ణయించిన కమీషన్‌ను తగ్గించాలనే నిర్ణయాన్ని వెంటనే పున: సమీక్షించాలని, పాత కమీషన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లియాఫీ నాయకులు శ్రీనివాస్, మాణిక్‌రెడ్డి, సుదర్శనం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

పూడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మహిళా సమాఖ్య ఉద్యోగులు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మండల, జిల్లా మహిళా సమాఖ్యా కార్యాలయాల్లో 23ఏళ్లుగా అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్లుగా ఫుల్‌టైం విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన సమయంలోనే తమకు కనీస వేతనం అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పిస్తూ సర్క్యులర్ నంబర్-261ను 2013లో జారీ చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేశారన్నారు. తెలంగాణ ఏర్పాటుతో అది మధ్యంతరంగా నిలిచిపోయిందన్నారు. మళ్లీ ఆ ఫైలును ప్రిపేర్ చేసి ఎంఎస్‌సీల మాదిరిగా వేతనం ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో అధ్యక్షుడు చిరంజీవి, సుధాకర్, ప్రశాంత్, మంజుల, నసీమా, భాగ్య, సునీత పాల్గొన్నారు.

డీఏలు, పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి

తపస్ ఆధ్వర్యంలో నిరసన



తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

కడ్తాల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డీఏలు, పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని, పీఆర్‌సీ ప్రకటించి అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కడ్తాల మండల కేంద్రంలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ధర్మాగ్రహ దీక్షలో భాగంగా భోజన విరామ సమయంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ముంతాజ్‌కు అందజేశారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన పెన్షన్, సరెండర్, మెడికల్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంతోష్ కుమార్, మల్లికార్జున్, నాయకులు భాస్కర్‌గౌడ్, సుమరంజిత, తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి: సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తలకొండపల్లి తహసీల్దార్‌కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తపస్ నాయకులు శ్రీనివాస్, సుజాత, మహేశ్,రవికుమార్, రమేశ్, మమత, సీత, రాధ, శ్రావణి పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఘనపురం సురధీర్ కోరారు. సోమవారం ఈ మేరకు చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్యకు వినతి ప్రతం అందించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను సత్వరమే ప్రకటించాలన్నారు. పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు మోర లక్ష్మణ్, చేవెళ్ల మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, హరిశంకర్, రవి తదితరులు ఉన్నారు.

పెట్టుబడిని తగ్గించి దిగుబడి పెంచాలి




రైతులకు అవార్డులను అందజేస్తున్న పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ మతూర్

షాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులు పెట్టుబడి తగ్గిస్తూ దిగుబడి పెంచాలని భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కె. మతూర్ అన్నారు. సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్, హైదరాబాద్, భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో రబీ నూనె గింజల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధిక దిగుబడినిచ్చే కుసుమ సాగులో యాంత్రికరణ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కుసుమ సాగులో యాంత్రీకరణ, ఆధునిక పరిజ్ఞాన, యాజమాన్య పద్ధతులు పాటిస్తూ పెట్టుబడులు తగ్గిస్తూ మంచి దిగుబడి సాధించిన మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి, రేగడిదోస్వాడ గ్రామానికి చెందిన రాజారత్నంను ఉత్తమ రైతులుగా గుర్తించి వారిని సన్మానించి, అవార్డులను అందజేశారు. కుసుమ సాగును ప్రోత్సహించిన సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సతీస్‌కుమార్, డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

గృహయోగం!

- నవంబరులో లబ్ధిదారుల గుర్తింపు
- ప్రత్యేక యాప్‌ను రూపొందించిన ప్రభుత్వం
- నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- తాండూరు డివిజన్‌కు మొత్తం 7వేల గృహాలు
- దీపావళి తర్వాత నిర్మాణానికి భూమి పూజలు
- ఇప్పటికే పూరైన ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు



ఇందిరమ్మ ఇళ్ల మోడల్

తాండూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హామీ మేరకు త్వరలోనే పేదల సొంతింటి కల నెరవేరనుంది. ఈ మేరకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకి సంబంధించి శనివారం జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రామాలు, పట్టణాల్లో సొంతిల్లు లేని అర్హులను ఇందిరమ్మ కమిటీల ద్వారా గుర్తించనున్నారు. అందులో భాగంగా దీపావళి తర్వాత నవంబర్ 1, 2 తేదీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజలు సైతం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామాలల్లో గ్రామ యూనిట్‌గా పట్టణాల్లో వార్డు యూనిట్‌గా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తియింది. తాండూరు డివిజన్ పరిధిలో తాండూరుతో పాటు కొడంగల్ నియోజకవర్గం ఉన్నాయి. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మొత్తం 7వేల ఇళ్లు మంజూరు కానున్నాయి. ఇంటి స్థలం ఉన్నట్లయితే యూనిట్ కాస్టుగా రూ. 5 లక్షలు, స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం దశల వారీగా ఆర్థిక సాయం అందజేస్తుంది. గృహ నిర్మాణ శాఖ ద్వారా పరిశీలించి మూడు దశల్లో పేమెంట్ ఇవ్వనున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఇందిరా అవాస్ యోజన పథకాన్ని పథకానికి అనుసంధానం చేసే అవకాశాలున్నాయి.

ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం

తెలంగాణ ఉద్యమంలో పోరాడిన ఉద్యమకారులకు ఈ పథకం కింద ప్రయోజనం చేకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారికి 250 గజాల స్థలంతో పాటు రూ. 5 లక్షలు ఇంటి నిర్మాణానికి మంజూరు చేయ నుంది. ప్రజాపాలన కార్యక్రమంలో తాండూరు, కొడంగల్ ప్రాంత ఉద్యమకారులకు ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తులు సమర్పించారు.

త్వరలో అమల్లోకి ప్రత్యేక యాప్

లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా అప్లికేషన్(యాప్)ను రూపొందించింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఈ యాప్‌లో తెలుగు వెర్షన్ ఉండేలా రూపొందించాలని నిర్ణయించారు. లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇళ్ల కేటాయింపు వరకు ఈ యాప్ ద్వారానే ప్రక్రియ చేపట్టనున్నారు. ఇది సవరణల అనంతరం నవంబర్ మొదటి వారంలో అమలులోకి రానుంది.

ఇన్‌చార్జి మంత్రికి మంజూరి అథారిటీ?

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరి అథారిటీ ఇచ్చే అవకాశలు ఉన్నట్లు సమాచారం. నియోజకవర్గాలలో మండలాలు, పట్టణాల్లో వార్డుల నుంచి వచ్చిన జాబితాలను పరిశీలించి స్థానిక శాసన సభ్యులు కలెక్టర్‌కు పంపిస్తారు. కలెక్టర్ జిల్లా స్థాయిలో క్రోడీకరించి జిల్లా ఇన్‌చార్జి, మంత్రికి పంపించి ఆమోదం తీసుకుంటారు. నవంబర్ మొదటి వారంలో ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమానికి పలువురు లబ్ధిదారులను ఎంపిక చేసే అవకాశాలున్నాయి.

ఎమ్మార్సీ భవనం ప్రారంభం

చౌదరిగూడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎట్టకేలకు నూతన మండల విద్యా శాఖ కార్యాలయం ప్రారంభమైంది. సోమవారం ఎంఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి మండల్ రీసోర్స్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌదరిగూడ మండలం కేంద్రం ఏర్పాటు తర్వాత కొత్తగా ఎంఈవో పోస్టును మండలానికి కేటాయించడం హర్షణీయమన్నారు. మండలంలో విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేస్తానన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంఈవోను జడ్పీ పాఠశాల హెచ్ఎం సునీత, టీచర్లు నర్సింహులు, శంకర్‌గౌడ్, నరేందర్, లీలామోహన్ సన్మానించారు.



ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వరద తాకిడికి కొట్టుకుపోయిన రోడ్డు



భారీగా వరదొచ్చి కొట్టుకుపోయిన రోడ్డు

- ఓ వైపు కోతకు గురై వాహనదారులకు ప్రమాదకరంగా మారిన వైనం
- కల్వర్టు నిర్మాణమే సమస్యకు పరిష్కారం

కేశంపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కరిసిన వర్షాలకు లేమామిడి-నిర్దవెల్లి రోడ్డులో నిర్దవెల్లి సమీపంలో బీటీ రోడ్డు ఒకవైపు కొట్టుకపోయి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. లేమామిడి శివారులో పెద్ద చెరువుంది. దీనికి గాంధీశంకర్‌పల్లి, తుర్కలపల్లిల నుంచి వరదొచ్చి చెరువు నిండింది. అలుగు నిర్దవెల్లి రోడ్డుపై పారి రోడ్డు అంచు కొట్టుకుపోయింది. పది ఫీట్ల బీటీరోడ్డు కొట్టుకుపోయిన చోట ఐదారు ఫీట్లకు కుచించుకుపోయి వాహనదారులకు ప్రమాదకరంగా పరిణమించింది. ఈ రోడ్డులో రాకపోకలకు వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు కొట్టుకపోయిన చోట రాత్రిపూట ప్రమా దాలు జరిగే ఆస్కారం మరింత ఎక్కువగా ఉంది. కాగా వరదతో చంద్రశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, నర్సింలు, రహీమ్ అనే రైతుల పొలాల్లో ఇసుక మేటలు వేసింది.

కల్వర్టు కడితేనే శాశ్వత పరిష్కారం...

లేమామిడి-నిర్దవెల్లి బీటీ రోడ్డులో పొలాల వద్ద దిగుడు ప్రదేశాల్లో ప్రతీ వానకాలం రోడ్డు కోతకు గురవుతోంది. వరద పారే చోట ఓ వైపు కల్వర్టు కట్టి మరోవైపు నిర్మించకుండా వదిలేశారు. దీంతో వరద భారీ వచ్చిన సమయాల్లో రోడ్డుపై నుంచి పారి బీటీ, మట్టి కొట్టుకుపోతోంది. రోడ్డు దిగుడు ప్రదేశాల్లో పూర్తి సామర్థ్యంతో కల్వర్టు కడితేనే రోడ్డు కోతను అరికట్టొచ్చు.

రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి



లేమామిడి-నిర్దవెల్లి మార్గంలో దెబ్బతిన్న రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. వరదకు మట్టి కొట్టుకపోయి రోడ్డు కుచించుకుపోయి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే భయమేస్తోంది. వెంటనే రిపేర్ చేయించాలి.

- ఖాజాపాషా, నిర్దవెల్లి

కల్వర్టును నిర్మించాలి



రోడ్డు కొట్టుకుపోయిన చోట శాశ్వతంగా కల్వర్టు నిర్మించాలి. తాత్కాలిక రిపేరు చేస్తే సమస్య పరిష్కారం కాదు. పెద్దపైపులు వేసి కల్వర్టు కడితే పెద్ద వరదొచ్చినా నీరు పైపుల నుంచి పారుతుంది. రోడ్డుపై వరద రాకుండా చేస్తేనే సమస్య తీరుతుంది.

- దిద్దెల ముత్యాలు, నిర్దవెల్లి

గ్రామానికి వీధి లైట్లు అందజేత



ఎంపీడీవో వెంకటమ్మకు వీధి లైట్లను అందజేస్తున్న దాత సత్యనారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం ముకునూరులో ఇటిక్యాల సత్యనారాయణరెడ్డి 30 వీధి లైట్లను సోమవారం గ్రామ పంచాయతీకి అందజేశారు. 36వాట్స్ ఎల్ఈడీ లైట్లను ప్రత్యేకాధికారి వెంకటమ్మ, పీఎస్ రాజ్‌కుమార్‌లకు అందించారు. గ్రామానికి దీపావళి కానుకగా తాను స్ట్రీట్‌లైట్లు ఇచ్చానని సత్యనారాయణరెడ్డి తెలిపారు.

బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు సరికాదు



సంగారెడ్డి జిల్లా జైలు వద్ద మాట్లాడుతున్న నాయకుడు కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పార్టీ రాష్ట్ర నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. ఇటీవల చేవెళ్ల మండలం అల్లావాడ బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసు పెట్టి సంగారెడ్డి జిల్లాలోని కంది సెంట్రల్ జైలుకు తరలించారు. రిమాండ్‌లో ఉన్న కార్యకర్తలను సోమవారం కార్తీక్‌రెడ్డి, మండల నాయకులు పరామర్శించారు. బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు.కేసులకు బీఆర్ఎస్ నాయకులు ఎప్పుడూ భయపడారని చెప్పారు. కార్యక్రమంలో చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి, నాయకుడు శివప్రసాద్, కార్యకర్తలు తదితరులున్నారు.

మంత్రి పొంగులేటికి భీం భరత్ శుభాకాంక్షలు



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న భీం భరత్

షాబాద్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం చేవెళ్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని మంత్రి నివాసానికి వెళ్లి ఫ్లవర్ బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కొండల్‌యాదవ్, ఉపేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, శరత్‌రెడ్డి, రాజు, దయానంద్‌గౌడ్ ఉన్నారు.

ఏఎంసీ అభివృద్ధికి పాలకవర్గం పని చేయాలి



ఎమ్మెల్యే యాదయ్య సమక్షంలో బాధ్యతలు చేపడుతున్న పెంటయ్యగౌడ్

చేవెళ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి నూతన పాలకవర్గం పనిచేయాలని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. సోమవారం చేవెళ్ల ఏఎంసీ కార్యాలయంలో కమిటీ నూతన చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు ఎమ్మెల్యే సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే వారిని సన్మానించి మాట్లాడుతూ... మార్కెట్ కమిటీని అభివృద్ధి చేస్తూ రైతులకు సేవలందించాలన్నారు. పాలకవర్గం ఐక్యంగా ఏఎంసీని అభివృద్ధి బాటలో నడిపించాలని కోరారు. ఇందుకు తన సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు, అధికారులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఆర్డీవో సాయిరాం బదిలీ

చేవెళ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం సోమవారం ఆర్డీవోలను బదిలీ చేసింది. ఇందులో భాగంగా చేవెళ్ల ఆర్డీవో సాయిరాం బదిలీ అయ్యారు. ఆయన సికింద్రాబాద్‌కు బదిలీ చేసింది. కాగా చేవెళ్ల నూతన ఆర్డీవోగా చంద్రకళను నియమిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేశారు. త్వరలోనే ఆమె చార్జి తీసుకోనున్నారు.

పథకాల అమలులో తెలంగాణ ఆదర్శం



గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):పథకాల అమల్లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి అన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. వెల్దండ, కల్వకుర్తి మండలాల 56మంది గీత కార్మికులకు సోమవారం క్యాంప్ కార్యాలయంలో కాటమయ్య రక్షణ కవచాల ను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గీత కార్మికులు తాటి, ఈత చెట్లపైనుంచి పడిపోకుండా ఉండేందుకు ప్రభుత్వం రక్షణ కవచాలను ఇస్తోందని చెప్పారు. అభివృద్ధిని అడ్డుకునేలా బీఆర్ఎస్ కుట్ర చేస్తోం దని ఆరోపించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు ప్రభుత్వం తోడ్పాటు

ఆమనగల్లు: చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల యువతకు నాగర్‌కర్నూల్ ఎంపీ ఎం.రవి ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ రుణాల మంజూరుపై గగ్గలపల్లి తేజ కన్వెన్షన్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతీ మండలం నుంచి 100మంది శిక్షణలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసిన వారికి రుణాలిస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ ఐళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ స్పోక్స్‌పర్సన్ జి.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ప్రభాకర్ రెడ్డి, కిషన్‌రెడ్డి, బిచ్యా, జగన్, డి.ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్, జవహర్‌లాల్, రాజేశ్, విజయమ్మ, కృష్ణనాయక్, తిరుపతి రెడ్డి, షాబుద్దీన్, శ్రీను, శేఖర్, వెంకటయ్య పాల్గొన్నారు.

కలెక్టర్‌గా నారాయణరెడ్డి

(5వ పేజీ తరవాయి)

ఎమ్మెస్సీ, బీఎడ్ చదివిన ఆయన, 2006 డీఎస్సీలో మహబూబ్‌నగర్ జిల్లా టాపర్‌గా నిలిచారు. స్వగ్రామంలోనే ఆరునెలలు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 2009 గ్రూప్-1పరీక్షల్లో రాష్ట్రంలో నాలుగో ర్యాంక్‌తో ఆర్డీవోగా నియమితులయ్యారు. అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత పదవులు నిర్వర్తించారు.

బాధ్యతలు చేపట్టిన నూతన కలెక్టర్

కలెక్టర్‌గా నియమితులైన సి.నారాయణరెడ్డి సోమవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. అందుకు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, కలెక్టరేట్ ఏఓ సునీల్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన చాంబర్‌కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు.

పది నెలల్లోనే శశాంక తనదైన ముద్ర

ఇప్పటిదాకా కలెక్టర్‌గా పనిచేసిన శశాంక ఇక్కడ 10 నెలలే పనిచేశారు. ఆయన పాలనాపరంగా తనదైన ముద్ర వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నగర శివార్లలోని అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై దృష్టిసారించింది. దీంతో ఆయన ఎక్కువగా రెవెన్యూ వ్యవహారాలే చేశారు. జిల్లాలోని పలు భూ కుంభకోణాలను వెలికితీశారు. రెవెన్యూ వ్యవస్థను గాడిలో పెట్టే యత్నం చేశారు. రాజకీయ వత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేశారు. ఆయన నిక్కచ్చిగా వ్యవహరించడం కూడా కొందరు రాజకీయనేతలకు నచ్చలేదు. ఆయన బదిలీ కోసం కొన్నాళ్లుగా తెరవెనుక తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఆయన బదిలీ అనివార్యమని గత జూన్ నుంచే ప్రచారం జరిగింది. ప్రభుత్వం అప్పగించిన పనులను సమర్థంగా నిర్వహించడంతో ఆయనకు ప్రభుత్వం మరో కీలక బాధ్యత అప్పగించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్‌సిటీ ప్రాజెక్టుతో పాటు ఇతర ముఖ్య ప్రాజెక్టులకు కమిషనర్‌గా నియమించింది.

టీకాతో ధీమా

(5వ పేజీ తరవాయి)

లక్ష పశువులకు టీకాలు వేశారు. పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గాలికుంటు వ్యాధి పికోర్నా విరిడే వైరస్ ద్వారా వస్తుంది. పశువులు కలుషిత నీరు, ఆహారం తింటే వ్యాధి వేగంగా వ్యాపిస్తుంది. పశువులు కలుషిత ఆహారం, నీరు తీసుకోకుండా పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.

గుర్తించడం ఇలా..

గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు 104 సెల్సియస్ నుంచి 106 డిగ్రీల జ్వరం వస్తుంది. నోరు, నాలుక, పెదవులు, చిగుళ్లు, గిట్టల వద్ద బొబ్బలు వస్తాయి. అవి పుండ్లుగా మారుతాయి. వ్యాధి సోకిన పశువుల నోటిలో పుండ్లతో మేత మేయక నీరసిస్తాయి. లాలాజలం కారుతుంది. గిట్టల్లో పుండ్లతో నడవలేవు. లేత పశువులకు వ్యాధి సోకితే చనిపోతాయి. కొన్ని పశువుల్లో పొదుగుపై బొబ్బలు ఏర్పడితే పొదుగు వాపునకు దారి తీస్తుంది.

చికిత్స ఇలా..

పశువుల నోరు, గిట్టల మధ్య ఏర్పడిన పుండ్లను వేడి నీటిలో పొటాషియం పర్మాంగనేట్ ద్రావణాన్ని కలిపి పుండ్లను కడగాలి. తరువాత బోరోగ్లిజరిన్ పేస్ట్ పుండ్లపై రాయాలి. పెన్సిలిన్ వంటి యాంటీబయోటిక్ వేయాలి.

నవంబరు 11 వరకు టీకాలు వేస్తాం

అన్ని రకాల పశువులకు గాలికుంటు నివారణకు టీకాలు వేస్తున్నాం. ఈ కార్యక్రమం నవంబరు 11వ తేదీ వరకు కొనసాగుతుంది. జిల్లాలోని పశువులు ఉన్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- శ్రీనివాస్ కుమార్, జిల్లా పశువైద్యాధికారి

మా రూటే సపరేటు!

(5వ పేజీ తరవాయి)

బీహార్‌కు చెందిన సంతోష్‌ప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని అతడి నుంచి చాక్లెట్ల రూపంలోకి మార్చిన 3.8కిలోల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. అతడు హైదరాబాద్‌కు వలసొచ్చి రెండేళ్లుగా గంజాయి విక్రయిస్తున్నట్లు తేలింది. మరో కేసులో పసుపు ప్యాకెట్ల రూపంలో గంజాయిని విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో నిర్ధారణ అయ్యింది.

లిక్విడ్ రూపంలోకి మార్చి ...

గంజాయిని లిక్విడ్ రూపంలోకి మార్చిన తరువాత హయిష్ ఆయిల్ అనే పేరుతో విక్రయిస్తున్నారు. దీని ధర కిలో రూ.8లక్షలపైనే అని తెలిసి పోలీసులే ఆశ్చర్యపోయారు. ఈ ఆయిల్ తయారీకి 35 నుంచి 40కిలోల ముడి గంజాయి అవసరం ఉంటుందని తెలుస్తోంది.

5ఎంఎల్‌కు మించితే వెరీ డేంజర్ ...

లిక్విడ్‌లోకి మార్చిన గంజాయి(హయిష్ ఆయిల్) కేవలం 5మిల్లీ లీటర్లు వాడితేనే మనిషి మత్తులోకి చేరుకుంటాడు. అంతకు మించితే కోమాలోకి వెళ్లే ప్రమాదముందని తెలుస్తోంది. తక్కువ సమయంలో ఎక్కువ మత్తు వచ్చే ఈ లిక్విడ్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని సమాచారం.

యువకులే టార్గెట్

గంజాయి వ్యాపారానికి అంతరాష్ట్ర ముఠా ఇబ్రహీంపట్నం ఆదిభట్ల పరిధిలో ఉండే ఐటీ ఉద్యోగులు, ఇంజినీరింగ్ విద్యార్థులనే టార్గెట్ చేసుకుంది. అలాగే పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు యూపీ, రాజస్థాన్, బీహార్ తదితర ఉత్తరాది రాష్ట్రాల నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నారు.

ఎవరినీ విడిచిపెట్టం

విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. గంజాయిని ఏ రూపంలో అమ్మినా ఎవరినీ వదలం. అమ్మకందారులపై 24/7 నిఘా పెట్టాం. గంజాయితో పాటు అక్రమంగా ఏ వ్యాపారం చేసినా ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలి. వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

- శ్రీనివాస్, సీఐ, ఎస్ఓటీ, మహేశ్వరం జోన్

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, కౌన్సిలర్

ఆదిభట్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి పనిచేస్తున్నామని ఆదిభట్లమున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి ఎంపీ పటేల్‌గూడ, బొంగ్లూరు, ఆదిభట్లల్లోని పలు వార్డుల్లో వైస్‌చైర్మన్ కామండ్ల యాదగిరి, కౌన్సిలర్ మర్రి అర్చనరాంరెడ్డిలతో కలిసి సోమవారం రూ.50లక్షల విలువైన సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రతీ వార్డులో ప్రజాసమస్యలు గుర్తించి వాటిని ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయించి పనులు చేస్తున్నామని చెప్పారు. వార్డుల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని, ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామన్నారు. సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, డీఈ స్వరణ్‌కుమార్ గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

తలకొండపల్లి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ప్రజా పర్యవేక్షణ, భాగస్వామ్యం ఉంటేనే అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెల్జాల బీసీ కాలనీలో రూ.10లక్షలతో చేసే సీసీ రోడ్డు పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. పనులు నాణ్యతగా చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధి, పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు పెద్దపీట కోరారు. కార్యక్రమంలో నాయకులు/అధికారులు ముజాబుర్ రహెమాన్, శ్రీనివాసమూర్తి, విక్రమ్‌రెడ్డి, శరత్, అజీజ్, నర్సింహ, నరేందర్‌గౌడ్, వెంకటరెడ్డి, విజయ్‌కుమార్, యాదయ్య, దర్శన్, అభిలాష్‌గౌడ్, విజయ్‌యాదవ్, బాలస్వామి, సాయి, మధు, యాదగిరి, పరంధాములు స్థానికులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌యాదవ్, నాయకులు

మానవ అక్రమ రవాణాను అరికడదాం



అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

షాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):మానవ అక్రమ రవాణాను అరికడదామని చేవెళ్ల ఇన్‌చార్జి సీడీపీవో సునీత, ఎంపీడీవో అపర్ణ, ప్రజ్వల సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ అన్నారు. ఎంపీడీవో మండల పరిషత్‌లో అంగన్‌వాడీ టీచర్లకు మానవ అక్రమ రవాణా నివారణపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం వారు మాట్లాడుతూ... మానవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, సృజనరాణి, పారిజాత, శ్రీలక్ష్మి, ప్రజ్వల స్టేట్ కోఆర్డినేటర్ సురేష్, సిబ్బంది అంబర్‌సింగ్, మిథాలిరాజ్, కేశవ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రగతి బీజేపీతోనే సాధ్యం



చౌదరిగూడ: సభ్యత్వ నమోదులో పాల్గొన్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాబాద్/చౌదరిగూడ/యాచారం,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):దేశప్రగతి బీజేపీతోనే సాధ్యమని వి కారాబాద్ బీజేపీ నాయకుడు నవీన్ కుమార్ అన్నారు. సోమవారం షాబాద్‌లో సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలుఅర్హులందరికీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కిరణ్, బూత్ అధ్యక్షుడు వినయ్, రాజు, రాజేష్, ప్రశాంత్, విజయ్, అనిల్ ఉన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి చౌదరిగూడ మండల పార్టీ అధ్యక్షుడు కుర్మయ్య ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఏడాది నిండకుండానే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతొచ్చిందన్నారు. ప్రజలు బీజేపీవైపు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు భూపాలచారి, నాయకులు సుధాకర్‌రావు, శ్రీనివాస్, రమేష్, మల్లేష్, యాదయ్య, భీమయ్య, నరేందర్‌రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు. యాచారం మండలంలో పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. మంతన్‌గౌరెల్లిలో పార్టీ సభ్యత్వాన్ని ప్రారంభించారు. పత్తితీత జోరైనా ఇబ్రహీంపట్నంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. వ్యాపారులకు తక్కువ ధరకే పత్తి అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు టి. రవీందర్,నాయకుడు గణేష్ తదితరులు ఉన్నారు.



మంతన్‌గౌరెల్లిలో బీజేపీ సభ్యత్వాన్ని ప్రారంభిస్తున్న పార్టీ నాయకులు

ఘనంగా సదర్ ఉత్సవాలు

(5వ పేజీ తరవాయి)

ఆకర్షణగా నిలిచాయి. యాదవసంఘ నాయకులు సందడి చేశారు. సదర్ సమ్మేళనానికి హాజరైన ప్రజాప్రతినిధులను, నాయకులను చుక్కాపూర్ సదర్ సమ్మేళన సంఘం అధ్యక్షుడు కాగుల శేఖర్, ఉపాధ్యక్షుడు దశరథం, కార్యదర్శి శ్రీశైలం, కోశాధికారి యాదయ్య, సంఘం నాయకులు చెన్నయ్య, పర్వతాలు సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యాదవుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రతిఏటా సదర్ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ మావిళ్లపల్లి వెంకటరెడ్డి, పాండురంగారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ మాజీ కోఆప్షన్ మెంబర్ ముజుబుర్ రెహమాన్, శ్రీధర్‌రెడ్డి, రంగారెడ్డి, పెంటారెడ్డి, యాదయ్య, కర్ణాకర్‌రెడ్డి, మల్లేష్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా

చౌదర్‌పల్లి కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

యాచారం: చౌదర్‌పల్లి కార్యదర్శిని సస్పెండ్ చేయాలని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీహరి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రమిచ్చారు. ఇంటి ఆస్తి సర్టిఫికెట్ ఇచ్చేందుకు లంచం డిమాండ్‌చేశారని, ఇంటియజమాని మధుసూదన్‌ను 'పురుగుల మందు తాగుపో' అని హేళనగా మాట్లాడడంతో అతడు క్రిమిసంహారక మందు తాగాడని తెలిపారు. ఇలాంటి పీఎస్ జ్యోత్స్నను సస్పెండ్ చేయాలని కోరారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

తలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వసతులు కల్పించాలని బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పద్మ అనిల్ కోరారు. ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన చంప్లానాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి కృషి చేయాలి

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలని ఎంఈవో లక్ష్మణ్ నాయక్ అన్నారు. నాగర్‌గూడ పాఠశాల విద్యార్థులకు దాతలు షూ, ఐడీ కార్డులు, టై, బెల్ట్‌లు, స్కూలుకు సౌండ్‌బాక్స్ ఇచ్చారు. పెయింటింగ్ వేయించారు.కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు డేవిడ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కృష్ణ, టీచర్లు నాగిరెడ్డి, నర్సింహులు, కవిత, మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్‌కు వీడ్కోలు సన్మానం

శంకర్‌పల్లి: జిల్లా ఉపవైద్యాధికారి దామోదర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం శంకర్‌పల్లిలోని డీఎమ్‌ఆర్ గార్డెన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వర్లు హాజరై దామోదర్‌ను సన్మానించారు. తోటి ఉద్యోగులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలకు నోటీసులు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈవో

ఆమనగల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బాలికలు, బాలురకు ప్రత్యేకంగా మరుగు దొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలన్న విద్యాశాఖ ఆదేశాలను పాటించని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యానికి సోమవారం ఎంఈవో పాండు నోటీసులిచ్చారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమనగల్లులోని లెనోరా ఫ్రైడ్ హైస్కూల్‌లో బాలికలు, బాలురకు ఓకే చోట మరుగుదొడ్లు, టాయ్‌లెట్ల ఏర్పాటుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవోకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీంతో బాలికలు, బాలురకు వేర్వేరుగా వాష్‌రూంలు ఏర్పాటు చేయాలని స్కూల్ మేనేజ్‌మెంట్‌కు ఎంఈవో ఆదేశించారు. అయినా తీరు మారకపోవడంతో సోమవారం పాఠశాలను సందర్శించిన ఎంఈవో పాండు నోటీసులు అందజేశారు. మేనేజ్‌మెంజ్ వివరణివ్వకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇనాం భూమి పేద దళితులకే చెందాలి



నేదునూరులో దళితులతో కలిసి భూమిని పరిశీలిస్తున్న నాయకులు

కందుకూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):నేదునూరులోని సర్వే నంబరు 154లో గల ఇనాం భూమి పేద దళితులకే చెందాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.రాంచందర్ అన్నారు. సోమవారం పార్టీ మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో దళితులతో కలిసి ఇనాం భూమిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ సర్వే నంబరులో ఎకరం 35 గుంటల భూమి 1954నుంచి1993 వరకు నేదునూరుకు చెందిన గోపం చెన్నయ్య, కొమ్ము బాలయ్య పేర ఇనాం పట్టా ఉండేదన్నారు. ఆ రైతులకు సమాచారం ఇవ్వకుండా మునగాల వెంకట్‌రెడ్డి కబ్జాచేసి రికార్డులు తారుమారు చేశారన్నారు. రెవెన్యూ అధికారులు భూమిని పరిశీలించి నిరుపేద దళితులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు యాదయ్య, చెన్నయ్య, నరసింహ, యాదయ్య, రాజయ్య, జి.శ్రీనివాస్, బి.సురేష్, మహిళలు పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ కమిటీ విస్తరణ

షాద్‌నగర్ అర్బన్ అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ బీఎస్పీ నియోజకవర్గ, మండల కమిటీలను విస్తరించామని జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్ సోమవారం తెలిపారు. నియోజకవర్గం ఉపాధ్యక్షుడిగా మణుగురి రాంప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కుమార్‌లను నియమించినట్టు తెలిపారు. పార్టీని బలోపేతం చేస్తామన్నారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు గుండేటి నర్సింహులు, గాదెపాక మోజెస్, ఎర్ర రాధాకృష్ణ, కొండేటి మహేందర్, ఆంంజనేయులు, రాజు, శరత్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష



నిందితుడు గంజేటి అంజయ్య

చౌదరిగూడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కాసులాబాద్‌లో జరిగిన హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగారాశిక్ష విధిస్తూ హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. ఎస్ఐ విజయ్ తెలిపిన వివరాల మేరకు.. జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాస్లాబాద్‌కు చెందిన గంజేటి అంజయ్య, అదే గ్రామానికి చెందిన తట్టేపల్లి రాజు 2020లో డబ్బుల విషయంలో ఘర్షణ పడ్డారు. దీంతో కక్ష పెంచుకున్న అంజయ్య అదే రోజు రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న రాజును గొడ్డలితో తలపై నరికి చంపాడు. డెడ్‌బాడీని మూడు ముక్కలు చేసి తలను మురుగు కాలువలో, నడుం భాగాన్ని పాడుబడ్డ బావిలో పడేశాడు. మూడు రోజులకు గ్రామస్తులు బావిలో మృతదేహాన్ని గుర్తించి రాజు అక్క బాలమణికి తెలిపారు. అది తన తమ్ముడేనని పోలీసులకు తెలిపారు. ఆమె ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కేసు విచారణానంతరం ఎల్బీనగర్ కోర్టు క్రిమినల్ న్యాయాధికారి హరీష్ నిందితుడికి జీవితకాల జైలు శిక్ష, రూ.15వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్సై వివరించారు.